క్లుప్తంగా

చల్లావారిపాలెం క్లాప్ మిత్రకు సత్కారం



గుంటూరు రూరల్: మండలంలోని చల్లావారిపాలెం గ్రామ క్లాప్ మిత్ర గోగుల శ్రీలక్ష్మికి రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఘన సత్కారం లభించింది. తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన సఫాయ్ మిత్ర, క్లాప్ మిత్రలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన చల్లావారిపాలెం క్లాప్ మిత్ర శ్రీలక్ష్మిను పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎంపీ గంధం చంద్రుడు శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చల్లావారిపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు సత్కారం అందుకున్న క్లాప్ మిత్రకు అభినందనలు తెలిపారు.

కేఎల్‌యూలో ఘనంగా కుమార్తెల దినోత్సవం

తాడేపల్లిరూరల్: కేఎల్ విశ్వవిద్యాలయంలో కుమార్తెల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళాభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ ఆడపిల్ల లేనిదే సృష్టి లేదన్నారు. తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడంలో కూతుర్లదే పైచేయి అని అన్నారు. ఆడ, మగా తేడా లేకుండా టెక్నాలజీతో దూసుకుపోతున్న ఈ రోజుల్లో ఆడపిల్లలు లేని లోటు ఎవరూ తీర్చలేనిదని అన్నారు. ఎంతోమంది కుమార్తెలు తల్లిదండ్రులు గర్వపడేలా విజయాలు సాధించడమే కాకుండా, తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారని అన్నారు. అనంతరం బాలబాలికలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ప్రొఫెసర్ సుభాకర్‌రాజు, మహిళా అభివృద్ధి సెల్ కో కన్వీనర్లు డాక్టర్ కె.సోని, కో ఆర్డినేటర్ కోనేరు శిరీష, వి.సాహితి, మొహమ్మద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి




లక్ష్మీపురం: ఐదు దశాబ్దాలుగా గానామృతంతో సంగీత ప్రియులకు తన దైన శైలిలో అనేక రకాల భాషలలో పాటలను ఆలపించిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ బాలు బహుముఖ ప్రజ్ఞాశాలి నేపథ్య గాయకుడు సంగీత దర్శకుడు నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా పేరొందన్నారు. ఇంజినీర్ పి.ఘన శ్యామాచార్యులు మాట్లాడుతూ తెలుగు, తమిళ, కన్నడ, హిందీ వంటి పలు భాషల్లో సుమారు 40 వేల కు పైగా పాటలు పాడారని గుర్తు చేశారు. ఇటువంటి వ్యక్తి మన అందరి హృదయాల్లో కొలువు తీరు ఉన్నరని చెప్పారు.

చెడు అలవాట్లకు బానిసలుగా మారితే అంధకారం

తాడికొండ: విద్యార్థి దశలో చెడు అలవాట్లకు బానిసలుగా మారితే జీవితం అంధకారం అవుతుందని ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు అన్నారు. మంగళవారం తాడికొండలోని కళాశాల బాలుర వసతి గృహంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ కీలకమైనది అని ఈ దశలో చదువును వదిలి గంజాయి, మద్యం ఇతర డ్రగ్స్‌కు అలవాటు పడి చాలామంది యువకులు భావి జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. చెడు అలవాట్ల నుంచి విద్యార్థులను దూరం చేసేందుకు కళాశాలలో పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలతో పట్టుపడితే చట్టరీత్యా కఠిన శిక్షలు ఉంటాయని సూచించారు. పాఠశాలలో కళాశాలల్లో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలుగా మారి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తల్లిదండ్రులు కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని చదివిస్తున్నారని వారి కష్టానికి తగిన ప్రతిఫలం ఇచ్చేలా విద్యార్థులు కష్టపడితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి స్థిరపడవచ్చు అన్నారు. విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ మల్లికార్జున్, సిబ్బంది రమేష్, నాగరాజు, వసతిగృహం వార్డెన్ నరేష్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రోస్టేట్ క్యాన్సర్‌తో అప్రమత్తం

- మగవారికి మాత్రమే వచ్చే జబ్బు ఇది
- ఆధునిక వైద్యసేవలతో వ్యాధి నయం
- సెప్టెంబర్ అవగాహన మాసం



ప్రోస్టేట్ క్యాన్సర్ పోస్టర్

గుంటూరు మెడికల్: కేవలం మగవారికి మాత్రమే వచ్చే వ్యాధుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటి. ఈ వ్యాధి 50 సంవత్సరాలు పైబడిన వారిలో వస్తుంది. వ్యాధిని సకాలంలో గుర్తించకపోతే శరీరంలోని ఇతర అవయవాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన విషయం కూడా తెలియకుండానే ఇతర యూరాలజీ సమస్యలతో వైద్యం కోసం వెళ్లేవారిలో ఈ వ్యాధిని గుర్తిస్తున్నారు. జీవితం అర్ధభాగంలో సంభవించే క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేయవచ్చు. 1989 నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలను జాతీయ ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు....

ప్రోస్టేట్ గ్రంథి మగవారి మూత్రనాళం కింద ఉంటుంది. ఇది వీర్యకణాలను మోసుకెళ్లే ద్రవపదార్థాన్ని తయారు చేయటం, లైంగిక సంపర్కం చేయటానికి దోహద పడుతుంది. సైలెంట్‌కిల్లర్‌గా పిలువబడే ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధి సోకినట్లు తెలుసుకోవటానికి వ్యాధి లక్షణాలు చాలా వరకు బయట పడకపోవటంతో వ్యాధి నిర్ధారణ త్వరితగతిన జరగటం లేదు. అంగస్తంబన చాలా కష్టంగా ఉండటం, వీర్యస్ఖలనం చేసే సమయంలో నొప్పి రావటం, వీర్యం తగ్గిపోవటం, దీర్ఘకాలికంగా వెన్నుముక నొప్పి, తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లటం, మూత్ర విసర్జనలో తొందరపాటు, అధికంగా మూత్రం వస్తున్నట్లు ఉండటం, మూత్ర విసర్జనకు చాలా సమయం తీసుకోవటం, మూత్రంలో రక్తం రావటం, రాత్రి నిద్రిస్తున్న సమయంలో మూత్ర విసర్జన వలన నిద్రాభంగం అవ్వటం, ఎముకలు నొప్పులు, కాళ్ల వాపులు, పొత్తికడుపు ఇబ్బందిగా ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ....

క్యాన్సర్ రావటానికి నిర్దిష్ట కారణాలు తెలియవు. ఎర్రటి మాంసం, అధిక కొవ్వు శాతం ఉన్న ఉత్పత్తులు తీసుకునేవారిలో, శుభ్రం లేకుండా వండిన మాంసం ఎక్కవగా తినటం వల్ల వచ్చే అవకాశాలు ఉన్నాయి. 60 ఏళ్లు పైబడిన మగవారిలో ముగ్గురిలో ఇద్దరు వృద్ధులు వ్యాధి బారిన పడుతున్నారు.

ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలి



ప్రోస్టేట్ క్యాన్సర్ కుటుంబంలో ఒకరికి వస్తే ఇతరులు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చు. జన్యపరమైన కారణాలతో ఈ వ్యాధి సోకుతుంది. ప్రోస్టేట్ క్యాన్సర్‌ను సీరం పీఎస్ఏ పరీక్ష ద్వారా వ్యాధి వస్తుందా లేదా అనే విషయాన్ని నిర్ధారించవచ్చు. ఒత్తిడి వలన క్యాన్సర్ పెరిగే ప్రమాదం ఉంది. యోగా, వ్యాయామం చేయటం మంచిది. వేళకు భోజనం చేయటం, క్యాన్సర్‌ను చంపే ఆహారమైన క్యాబేజ్, క్యాలీఫ్లవర్, పచ్చని ఆకుకూరలు, చేపలు ఆహారంలో తీసుకోవటం చాలా మంచిది.

–డాక్టర్ జొన్నకూటి కొర్నేలియస్, యూరాలజిస్ట్, గుంటూరు

ఆధునిక చికిత్సలతో నయం చేయవచ్చు...



ప్రోస్టేట్ క్యాన్సర్ చాలా చిన్నగా పెరుగుతుంది. సకాలంలో వ్యాధిని గుర్తించి ఆపరేషన్ చేయటం వల్ల పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్ సోకినవారు పీఎంఎస్ పెట్ స్కాన్ పరీక్ష చేయించుకోవటం ద్వారా శరీరంలో ఏఏ భాగాల్లో క్యాన్సర్ సోకిందో తెలుసుకుని చికిత్స చేయవచ్చు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ల్యాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జరీలతో కోత కుట్టు లేకుండా చేసే ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

క్రీడల్లో పాల్గొనేందుకు స్టాఫ్‌నర్సుకు సాయం



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న వేల్పుల విజయ్‌కుమార్‌కు ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు మంగళవారం రూ. 19 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఉదయపూర్‌లో ఈ నెల 28 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ దివ్యాంగ క్రికెట్ టీ 20 కప్‌కు వేల్పుల విజయ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి నుంచి జాతీయ జట్టుకు కీపర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న విజయ్ మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజీని పాల్గొన్నారు.

భువనేశ్వర్‌కు మహాప్రస్థానం వాహనం

గుంటూరు మెడికల్: కలుషిత ఆహారం తిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్ నుంచి మృతుడి స్వస్థలం భువనేశ్వర్‌లోని సరసకోలా గ్రామానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చొరవతో మహాప్రస్థానం వాహనంలో తరలించారు.

పశ్చిమ గోదావరి జిల్లా మందుపట్రులో చేపల చెరువులో పనులు చేసుకునేందుకు ఒడిశాకు చెందిన అజయ్ కుమార్ మహంతి తన కుటుంబ సభ్యులతో వచ్చారు. ఈ నెల 25వ తేదీన మహంతి చేసిన భోజనం కలుషితం అయింది. వెంటనే అదేరోజు రాత్రి 8 గంటలకు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున చనిపోయాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించాలంటే కనీసం రూ.50 వేలు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వారి సహాయకులుగా వచ్చినవారు వెంటనే సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌కు సమస్యను విన్నవించారు. స్పందించిన ఆయన మృతదేహాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టారు. గతంలో జిల్లాకే పరిమితమైన మహాప్రస్థానం వాహనాలు ఇతర రాష్ట్రాలకు కూడా పంపిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. గతంలో ఉత్తరప్రదేశ్, చిత్తూరు జిల్లా మదనపల్లిలకు మృతదేహాలను పంపించామని తాజాగా భువనేశ్వర్ పంపించామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు పేదోళ్లకు న్యాయం చేయాలనీ ఇస్తున్న సూచనలను పాటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందా నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు భవన నిర్మాణాలు చేపట్టాలి

కమిషనర్ కీర్తి చేకూరి



బిల్డింగ్ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాల ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకుండా, సెట్ బ్యాక్‌లో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ వసంతరాయపురంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను, శారదా కాలనీ, మల్లికార్జున పేట, భారత్ పేట, శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకుండా చూడాలని, ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్ లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందని హెచ్చరించారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలని, రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్ లు నామ మాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కన్‌స్ట్రక్షన్ చేయాలన్నారు. ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. అలాగే ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో పారిశుద్ధ్య పనులకు బాధ్యత వహించాలని, గ్యాంగ్ వర్క్ పనుల రిపోర్ట్ ప్రతి రోజు తమకు పంపాలన్నారు. డంపర్ బిన్ల దగ్గర అపరిశుభ్రం లేకుండా చూడాలని, సెకండరీ కలెక్షన్ పాయింట్స్ నుండి నిర్దేశిత సమయంలో చెత్త తరలించాలని ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాబూరావు, టీపీఓ నాగ వల్లి, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

30న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఏపీటీఎఫ్ ధర్నాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 30న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపల్లి మంజుల తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు, సంఘ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాలీద్, నాయకులు జోసెఫ్ కిరణ్, పసుపులేటి శ్రీను, వందనం, సత్యనారాయణమూర్తి, సాయి, శివశంకర్, లక్ష్మీనారాయణ, జ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: రోడ్డు వెడల్పు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా బుధవారం నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్బరాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. డీ4 సెక్షన్ పరిధిలో పలకలూరు రోడ్డు, కృష్ణబాబు కాలనీ, సాయిబాబా నగర్, రత్నగిరి కాలనీల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మలేరియా, డెంగీలపై అవగాహన

మంగళగిరి: నగరంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం మలేరియా, డెంగీ జ్వరాలను గుర్తించి చికిత్స అందించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారన్నారు. ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ తమ పరిధిలో ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్ ఎం సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంటు శ్రీనివాస్, నరసింహారావు, మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, పక్కన మధుసూదన్, సుధీర్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం జాతీయ వైద్యారోగ్య మిషన్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్యారోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఎయిడ్స్ అనే మహమ్మారిపై ప్రతి ఒక్కరికి అవగాహనతో పాటు ఆరోగ్య విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. హెచ్ఐవీ బారిన పడిన వారిని దూరంగా ఉంచి, బాధ కలిగించే విధంగా ప్రవర్తించకుండా వారిలో మనోధైర్యాన్ని నింపేలా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా యువత ఎయిడ్స్ మహమ్మారి గురించి ప్రజల్లో అవగాహన కలిగించే విధంగా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ మన ఆరోగ్య అభివృద్ధి మనం చేసే పనులపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రతి యేటా విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు. క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన టీజేపీఎస్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, సిమ్స్ కళాశాల విద్యార్థి బృందాలకు వరుసగా రూ.ఐదు వేలు, రూ.నాలుగు వేలు, రూ.మూడు వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయి పోటీల విజేతలకు రాష్ట్ర స్థాయిలో పోటీలకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ బి.లక్ష్మానాయక్, జిల్లా సూపర్ వైజర్ బి.వీరాస్వామి, పి.శ్రీవిద్య, ఆర్.శ్రీనివాసరాజు, ఆరోగ్య విద్యా అధికారి కృష్ణారావు, గుంటూరు జాతీయ సేవా పథక నిర్వహణాధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి ఆర్. జయ శైలజ పాల్గొన్నారు.

కాల్ చేసుకుంటానని చెప్పి ఫోన్‌తో ఉడాయించాడు

మంగళగిరి: నగరంలో మంగళవారం రెండు సెల్‌ఫోన్‌లు చోరీకి గురైన ఘటనలు చోటు చేసుకున్నాయి. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం నుంచి శ్రీ పానకాల లక్ష్మీనృసింహస్వామి కొండకు వచ్చిన భక్తుడు రంగయ్యను ఓ యువకుడు గుడికి వచ్చిన తమ వారు కనిపించడం లేదని ఒక సారి ఫోన్ ఇస్తే ఫోన్ చేసుకుని ఇస్తానని చెప్పి ఫోన్ తీసుకున్నాడు. రంగయ్య తమ కుటుంబసభ్యులతో మాట్లాడుతుండగా యువకుడు సెల్‌ఫోన్‌తో పరారయ్యాడు. కంగుతిన్న రంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని హుస్సేన్ కట్ట వద్ద యువకుడు పడిపోతున్నట్లు నటించగా స్థానికంగా ఉంటున్న మద్ది శివప్రసాద్ పట్టుకునేందుకు ప్రయత్నించాడు. యువకుడు శివప్రసాద్ జేబులోని ఫోన్ లాక్కుని పరారయ్యాడు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు కేసులు నమోదు చేసి సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి దుండగులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

నగరంలోని కొత్తపేటలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొత్తపేటకు చెందిన నవీన్ సోమవారం రాత్రి తన ఇంటి ముందు ద్విచక్రవాహనం పార్కింగ్ చేసి మంగళవారం ఉదయం లేచి చూడగా ద్విచక్రవాహనం కనిపంచలేదు. దీంతో నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

బోధన నైపుణ్యాలు అభివృద్ధి పరచుకోవాలి

ఎంఈఓ–1 వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న గుంటూరు తూర్పు ఎంఈఓ–1 వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని గుంటూరు తూర్పు ఎంఈఓ–1 వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలని చెప్పారు. వృత్తి పరమైన బోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఎండీ ఖాసిం మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను ఒకరితో ఒకరు పంచుకోవడానికి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు దోహదపడతాయని, ఉపాధ్యాయులందరు విధిగా సమావేశాలకు హాజరై బోధన అనుభవాలను పంచుకోవాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్వీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు కేటాయించిన పాఠశాల కాంప్లెక్స్ సమావేశానికి ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలని, ఎస్సీఈఆర్టీ, సబ్జెక్ట్ ఉపాధ్యాయుల ద్వారా రూపొందించిన కార్యక్రమ సూచనల ప్రకారం సమావేశాలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు పి.జఫరుల్లా ఖాన్, వసుంధర పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మకు నివాళి



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘు నాయకులు

నెహ్రూ నగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ జయంతి బాలాజీ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్రవర్ణాల్ని ఎదిరించి భూ పోరాటంలో విజయం సాధించిన వీర మహిళ చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. ఐలమ్మ పోరాటంతోనే తెలంగాణలో ఉన్న రైతులందరూ సమానత్వం కోసం భూమి కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రైతులను ఏకం చేసి లక్షలాది ఎకరాలను భూమిని రైతులకు పంచి పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సలహా మండలి చైర్మన్ సాదం సత్యనారాయణ, రజక ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొణిదల మురళీకృష్ణ గుంటూరు జిల్లా రజక జనసేవా సంఘం నాయకులు వట్టికూటి సాంబయ్య, బీసీ సంఘం నాయకులు నిడుముక్కల రాంబాబు, బీసీ మహిళలు కె.సామ్రాజ్యం, డి.సీతారావమ్మ, గుంటూరు టౌన్ రజక జన సేవ సంఘం నాయకులు చాగంటిపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థిని

ప్రత్తిపాడు: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ముట్లూరు హైస్కూల్ విద్యార్థిని ఎంపికయ్యింది. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్ జాతీయ స్థాయిలో ఐటీ రూరల్ క్విజ్ -2023 పోటీలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా మంగళవారం గుంటూరులోని డీసీఈబీ సెమినార్ హాలులో డీఈఓ, డీఎస్‌వోల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. అందులో వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎం.గ్రీష్మాచౌదరి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

- ప్రారంభించిన ఉప విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు
- అట్టహాసంగా ప్రారంభమైన నియోజకవర్గస్థాయి ఎంపికలు



వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి ఎంపికలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న పోటీలను తొలిరోజు జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, షటిల్ ఆడి ఎంపికలను ప్రారంభించారు. మంగళవారం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా ఎంపికలు అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా జరిగాయి. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరురూరల్, వట్టిచెరుకూరు మండలాల్లో మండల స్థాయి ఎంపికల్లో ఎంపికైన సుమారు 250 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటారు. ఉదయం ఓ మోస్తరు వర్షంతో ఆటంకం కలిగినప్పటికీ, మధ్యాహ్నం వర్షం లేకపోవడంతో క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు..

విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించిన ఆయన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఆటల్లో గెలుపోటములను స్పోర్టివ్‌గా తీసుకోవాలని, క్రీడల్లో రాణిస్తే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు హెచ్. శ్రీనివాసరావు, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డేవిడ్ రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ జి.ప్రతాప్‌రెడ్డి, మాజీ సెక్రటరీ పేరం మస్తాన్ రెడ్డి, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



మంగళగిరి: నగరంలోని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌కు 60 పుస్తకాలను రచయితలు అందజేశారు. మంగళవారం గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మానవత కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి రచించిన 13వ పుస్తకం టైంపాస్ 50 కాపీలతోపాటు మేరా భారత్ మహాన్ పది కాపీలను అందజేశారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ అమరనాథరెడ్డి రచనా శైలి అత్యంత సామాన్యంగా ఉంటుందని, ముఖ్యంగా టైంపాస్ టులో అందవిశ్వాసాలు, రుగ్మతలను నవ్వుతూ ఆలోచించే విధానం సామాజిక స్పృహ కలిగించే అంశాలన్నిటిని చాలా చిన్న పదాలతో సమాజంలో జరిగే సంక్లిష్టమైన సమస్యలకు సులువైన పరిష్కార మార్గాలకు అన్వేషించే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మానవత కో కన్వీనర్ సలీం మాలిక్, డాక్టర్ బి జాన్‌ప్రసాద్, వైఎస్సార్ ఇంటలెక్చువల్ వ్యవస్థాపక సభ్యులు కంది పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

అర్.యన్. వంశీకృష్ణ, అడ్వకేట్
2/2 అరండల్‌పేట, గుంటూరు. సెల్: 9440633091